



—రేవమూరు శమంత




జయలక్ష్మి మనసు చివుక్కు మనేది.

తండ్రి వాచ్యంగా తన భావం వెల్లడించకపోయినా అతని తలమీద బరువు నానాటికి హెచ్చు కాజొచ్చింది. క్రమేపీ కూతుర్ని దగ్గరకు తీసేవాడు కాడు. జయలక్ష్మి తెలివిగల పిల్ల. తలిదండ్రుల విచారం గ్రహించింది. ప్రతి దినం దేవుడి గదిలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి పటం ముందు నిలబడి, తనకు త్వరగా పెండ్లి కావాలని ప్రార్థించేది.

జయలక్ష్మికి పదిహేనో ఏడు నడుస్తున్నప్పుడు వాసుదేవరావు బాల్య స్నేహితుడు సాంబయ్య వచ్చాడు. భోజనమైన తరవాత మాటల్లో దిగారు. వాసుదేవరావు తన కూతురు విషయం ప్రస్తావించాడు. సాంబయ్య వెంటనే అందుకున్నాడు: "వాసూ! ఆడబోయిన తీర్థ మెదురైం దన్నట్లుంది. హైదరాబాదులో వ్యవసాయార్థం ఉపయోగపడే ఎరువు వగైరాలు అమ్మే పెద్ద కంపెనీ — ఆంధ్రా ఫెర్టిలైజర్స్ అనే పేరుతో ఉంది. దాని మేనేజర్ రాధాకృష్ణయ్యతో నాకు బాగా పరిచయం వ్యాపారం ద్వారా. మాసం అయిదు వందల జీతం. చాలా మంచివాడు. పాపం, అతని భార్య విషజ్వరం తగిలి చనిపోయింది. ఇంట్లో సంసారం దిద్దుకోవడానికి ఎవరూ లేక రెండు సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నాడు. హోటల్ భోజనం సరిపోక వంటపనీ అతనే చేసుకుంటున్నాడు. మంచి కుటుంబంలో పిల్లను పెళ్లి చేసుకోవడానికి నిశ్చయించుకున్నాడు. నాతో చెప్పాడు, తగిన సంబంధం చూడమని. కట్నాలు, కానుకలు ఏమీ అపేక్షించడు. మీ అమ్మాయికి దివ్యమైన సంబంధం."

వాసుదేవరావు నమ్మలేకపోయాడు. తనమీద పడి ఉన్న బరువు సగం తగ్గినట్లయింది. రెండో పెళ్లి అయితే మాత్రం ఏం? మొదటి భార్య సంతానంకూడా లేదు. హాయిగా జీవించగలదు తన కూతురు. అయినా, ఒక ప్రశ్న వేశాడు, "ఆయన వయస్సు?" అని.

"సుమారు నలభై ఉండవచ్చు. అయితే, ముప్పై ఏండ్ల వాడిలాగ కనబడతాడు" అన్నాడు సాంబయ్య.

వాసుదేవరావు ఆలోచించాడు. జయలక్ష్మికి పదిహేను నిండలేదు. పాతికేళ్ల వారా. అందుకోసరమని ఇంత మంచి సంబంధం వదులుకోవడమా?

"మరేమీ అనుమానించవద్దు, వాసూ! జయలక్ష్మి నా కూతురైతే కళ్లకద్దుకుని ఒప్పుకునేవాణ్ణి" అని సాంబయ్య ప్రోత్సాహకరంగా చెప్పాడు. వాసుదేవరావు నిట్టూర్చి, "సరే" అన్నాడు.

"వై ఆదివారం పిలుచుకుని వస్తాను" అంటూ సాంబయ్య తీర్మానం చేశాడు.

ఆ రాత్రి వాసుదేవరావు భార్యతో ప్రసంగించాడు. ఆవిడ వయసు వ్యత్యాసం గురించి ఆక్షేపించలేదు. "అత్త, ఆడబిడ్డల పోరు లేకుండా స్వతంత్రంగా సంసారం చేసుకుంటుంది. అతను కూడా అరచేతుల్లో ఉంచుకొని ఆదరిస్తాడు. పట్టణవాస భోగాలన్నీ అనుభవిస్తుంది" అనే మాటలు వాసుదేవరావుకు ధైర్యమిచ్చాయి. అయితే, వయసు గురించి మాత్రం జయలక్ష్మికి చెప్పనక్కరలేదని ఇద్దరూ నిశ్చయించుకున్నారు. రెండో పెళ్లి అని చెబితే చాలు.

జయలక్ష్మితో చెప్పింది తల్లి. జయలక్ష్మి పలకలేదు. ఏమనగలదు? తన శ్రేయస్సు కోరేవారు తల్లిదండ్రులకన్నా ఇంకెవ్వరు? ఏ విధంగానో నన్ను గ

వాటిస్తే చాలు ననుకున్నట్లుంది. 'పోనీ, నా నుంచి బాధ ఇక ఉండదు' అని తనలో తా ననుకుంది.

ఆదివారం సాంబయ్య వచ్చాడు రాధాకృష్ణయ్యతో. జయలక్ష్మిని ముస్తాబుచేసి కూర్చోపెట్టారు. రాధాకృష్ణయ్య ఎక్కువ ప్రశ్న లడగలేదు. ఏమాత్రం చదువుకుందని, పాట వచ్చునా, వంట అభ్యాసం ఉందా అని అడిగాడు. "ఇంగ్లీషు చదువు ఎక్కువగా చదువుకో లేదు. తెలుగు, సంస్కృతం నేనే నేర్పాను" అని వాసుదేవరావు చెబుతూఉంటే అతని భార్య అందుకుని, "వంట బాగా చెయ్యగలదు, నాయనా!" అని సర్టిఫికేట్ ఇచ్చింది. సాంబయ్య నవ్వుతూ, "ముఖ్యమైన విషయం చెప్పారు" అని ప్రశంసించాడు. రాధాకృష్ణయ్య కూడా నవ్వాడు. ఏదైనా పాడమన్నాడు. జయలక్ష్మి హార్మోనియమ్ వాయిస్తూ, "సుజన జీవనా" అనే కీర్తన పాడింది. రాధాకృష్ణయ్య, "ఏమి కంఠం! పాపం, మంచి విద్వాంసుడి దగ్గర నేర్చుకునే అవకాశం లేకపోయింది" అని మెచ్చుకున్నాడు. జయలక్ష్మి లేచి లోపలికి వెళ్లి పోయింది.

రాధాకృష్ణయ్యకు అమ్మాయి నచ్చింది. తన మొదటి భార్యకన్న ఎంతో సౌందర్యవతి. మర్యాద గల కుటుంబం. వంట బాగా వచ్చునన్నారు. సంసారం చక్కగా దిద్దుకోగలదు. ముహూర్తం త్వరగా పెట్టుకో మని చెప్పి వెళ్లిపోయాడు. కట్నాలు, లాంఛనాలు వాటి విషయం మాట్లాడనైనా లేదు.

వాసుదేవరావు సంతోషభరితుడైనాడు. కూతుర్ని అడిగాడు, "మా కందరికీ నచ్చాడు. మరి నీకో?" అని.

జయలక్ష్మి, "మీ ఇష్టం, నాన్నా!" అని ముక్తసరిగా చెప్పి ఊరుకుంది. తండ్రి, 'చిన్నపిల్ల. ఇంకేమి చెబు తుంది?' అని సమాధానం చెప్పుకున్నాడు.

జయలక్ష్మికి అతను తనకన్నా చాలా పెద్దవాడని స్పష్టమైంది. తన అక్కలిద్దరికి వాళ్ల ఈడువాళ్లే భర్తలుగా కుదిరారు. నిజమే. అయితే, ఒక బావకు వ్యవసాయమే. ఇంకో బావ ఏదో ఆఫీసులో గుమాస్తా. ఇతను పెద్ద ఉద్యోగస్థుడు. పెద్దక్కయ్య ఒక కుగ్రామంలో, ఇంకో అక్కయ్య కర్నూలులో సంసారాలు చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరం. రాజధాని. జయలక్ష్మి కర్నూలు తప్ప ఇంకే పట్టణం చూడలేదు. అలాంటి దానికి అంత పెద్ద పట్టణంలో కాపరంచేసే అవకాశం దొరుకుతుంది. పెద్ద షాపు లుంటాయి. రక రకాల చీరలు కొనుక్కోవచ్చు. అతనికి నెలకు అయిదు వందల జీతమట. రాణిలాగ జీవించవచ్చు. ఇటువంటి ఆలోచనల్లో వయసు తేడా లోపం మరుగుపడింది.

వాసుదేవరావు సాంబయ్యవద్ద కొంత పైకం అప్పు తీసుకొని పెళ్లి సవ్యంగానే జరిపించాడు. పెళ్లి కుమారుని తరఫున నలుగు రైదుగురు బంధువులు, కొందరు స్నేహితులు మాత్రమే వచ్చారు.

రాధాకృష్ణయ్య పెళ్లి అయిన రోజే గర్భాదాన ముహూర్తం కూడా పెట్టించమని కోరినందువల్ల అలాగే చేశాడు వాసుదేవరావు. అల్లుడు ఒక వారం సెలవు పుచ్చుకొని వచ్చినందువల్ల అతని కోరిక సబబు గానే తోచింది.

భోజనాలైన తరవాత జయలక్ష్మిని సింగారించి గదిలోకి పంపించారు. జయలక్ష్మికి స్త్రీ పురుష సంబంధం గురించి కొంచెమైనా జ్ఞానం లేదు. "జయం! మరీ సిగ్గుపడకుండా ఆయన ఇష్టప్రకారం ఉండాలి" అని పెద్ద వదిన హెచ్చరించి పంపింది. అంతే. అతను ఏం చేస్తాడో, ఆయన కేం ఇష్టమో ఊహించలేక పోయింది. తెలుసుకోవాలి అనే అభిలాష కూడా లేదు.

తలుపు వద్దనే నిలబడి ఉన్న జయలక్ష్మిని చూచి రాధాకృష్ణయ్య తలుపు గడియ వైచి, ఆవిడ చెయ్యి పట్టుకొని 'రా, కూర్చో' అని మంచం దగ్గరికి తీసుకొని వెళ్లాడు. జయలక్ష్మి కూర్చోలేదు. అతను భుజాలు పట్టుకొని మెల్లగా కూర్చోపెట్టాడు. జయలక్ష్మి కంతా కొత్తగా ఉంది, ఇలా ఒక పురుషుడితో గదిలో ఒంటరిగా ఉండటం. తల వంచుకునే ఉంది. "నీ పేరు జయలక్ష్మి కదూ?" అని అడిగా డతను. అవునని మెల్లగా చెప్పింది. "నేను నిన్ను జయా! అని పిలు స్తాను. సరేనా?"

"మీ ఇష్టం. మా అమ్మ, నాన్న జయమ్మా అని పిలుస్తారు. పెద్ద వదిన జయం అంటుంది" అని చెప్పింది జయలక్ష్మి.

"నువ్వెప్పుడైనా హైదరాబాద్ వెళ్లావా?"

"లేదు."

"చాలా గొప్ప పట్టణం. పెద్ద మేడలు, భవనాలు, షాపులు, పార్కులు ఉంటాయి. బజార్లలో ఏది కావా లన్నా దొరుకుతుంది. అన్నీ చూపిస్తాను. బట్టల దుకాణాల్లో రకరకాల చీర లుంటాయి. నీకు నచ్చినవి కొనుక్కోవచ్చు."

'అమ్మయ్య. నే ననుకున్నట్లే?' అని స్వగతంగా అనుకొని, తల ఎత్తి చూచింది భర్తను. అంత వయసు మీరిన వాడిలాగా లేడు. దుబ్బు మీసాలు, గుండ్రని ముఖం, వెడల్పయిన ముక్కు, చామనఛాయ — అందంగా లేడు, అసహ్యంగా లేడు.

భర్త మళ్లీ మాట్లాడుతున్నాడు: "తొందరగా పడుకుంటావు కదూ, పెళ్లి సంబరంలో అలిసిపోయి ఉంటావు."

'ఎంత దయగా మాట్లాడుతున్నారు' అనుకొని, "లేదండి. ఇంట్లో పనులన్ని తీరేటప్పటికి ఆలస్యమే అవుతుంది" అని బదులు చెప్పింది జయలక్ష్మి.

రాధాకృష్ణయ్య భార్యను దగ్గరగా తీసుకుని కౌగ లించుకొని ముద్దుపెట్టుకున్నాడు. జయలక్ష్మి కిదే మొదటి ముద్దు. పురుషుని పెదవులు తన పెదవులను స్పర్శించడం ఇదే మొదటిసారి. ఇందులో స్వారస్యం ఏమా అని అనిపించింది జయలక్ష్మికి. అయ్యో, మళ్లీ మళ్లీ ముద్దు పెట్టుకుంటున్నాడు. బాగోలేదు తనకు. ఏం చేస్తుంది? వదినగారి హెచ్చరిక జ్ఞాపకం వచ్చింది. ఆయన కిది ఇష్టం కాబోలు. వద్దని చెప్ప రాదు. ముద్దుల వర్షం ఆగింది. 'అబ్బా' అని మనసులో అనుకొని, చీరకొంగుతో తన పెదివులు తుడుచుకుంది. రాధాకృష్ణయ్య తన జుబ్బా తీసివేసి దీపం ఆర్పాడు. పడుకుంటాడని ఊహించింది. "పడుకుంటారా? ఈ వైపు మీరు పడుకోండి. నే నావైపు పడుకుంటా" నని చెప్పింది వినయంగా. అతను నవ్వుతూ, "పడుకుందాం. అదో మీ వదిన ఉంచింది తెల్ల చీర. కట్టుకో. పట్టు చీర నలిగిపోదూ?" అన్నాడు. అయితే, అత నక్కడుంటే ఎలా చీర మార్చుకోవడం అని, మెల్లగా అంది జయలక్ష్మి "మీరు కొంచెం బయటకు వెళ్లండి, కట్టుకుంటాను"

కావలెను

మా తెలుగు సాంఘిక చిత్రంలో నటించేందుకు అందచందాలుగల నూతన నటీ నటులు కావలెను.

పురుషులు ఎత్తు: 5 అ. 5 అం. నుంచి 5 అ. 9 అం. లు

స్త్రీలు ఎత్తు: 5 అ. 2 అం. నుంచి 5 అ. 5 అం. లు

వివరాలతో వ్రాయండి:

శ్రీ కనక పిక్చర్స్.

నం. 8, శివజ్ఞానం రోడ్డు, టి. నగర్, మద్రాసు—17. ఫోన్: P.P. 444616

ప్రసిద్ధి చెందిన భారత్ వారి పేము కుర్చీలు ప్రతి ఇంటా, ఆఫీసులో తప్పక ఉండవలసినవి.



శ్రీ జయభారతం అండ్ కం. (రిజిష్టర్డు)
82, ఆర్. హెచ్. రోడ్డు, మద్రాసు—14.

ఆర్డర్లతో 50% అడ్వాన్సు తప్పక పంపవలెను. ముఖ్యమైన అన్నిటౌన్లలోను మాకు స్టాకిస్టులు కావలెను. ఉచిత కేటలాగుకు మీ అడ్రసు స్పష్టముగా వ్రాయండి. 2

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

DOL-327 TEL







ముగింపు తేది: 15-7-70

కి సొల్యూషన్: 18-7-70

ఎంట్రీ రుసుము రు. 1/-
3 ఎంట్రీలు రు. 2—50
5 ఎంట్రీలు రు. 4/-

(ఆంధ్రప్రభ, పత్రిక డైలీలలో)
(సుప్రీంకోర్టు తీర్పు ననుసరించి నిర్వహించ బడుచున్న సాహిత్య పోటీ)

1. — చూడండి నిజంగా మనతో ఉన్నట్టే ఉంటాడండి కళ్ళల్లోకి చూస్తాడు (అంతరార్థము/ప్రతిబింబము)
2. — వుంటే గారి నీ మాటే ఎత్తదు (తండ్రి/భర్త)
3. వాకు నచ్చిన — ప్రతిమకు వచ్చక పోవచ్చు (చీర/నగ)
4. వాళ్ళిద్దరూ ఆ విధమైన — లోనే ఆనందము పొందుతారు (సాంగత్యము/జీవితం)
5. ఏదో రకమైన — తో మనసు బాధపడటం తప్పటం లేదు (దుఃఖం/కష్టం)
6. చూశారా? మా వదినగారు ఈ పూటే యేదో ఒకటి—పంపాలని చూస్తుంది (పెట్టి/చెప్పి)
7. పార్వతమ్మ అందర్ని పలకరిస్తూ యోగక్షేమములు తెలుసుకుంటూ — పెట్టి కొందర్ని పరిహాసం చేస్తున్నారు. (పేర్లు/వరుసలు)
8. వారు — పోయేలా కేకవేసి తన వాగ్ధాటినంతా ఉపయోగించి (అరిగి/ఆరి)

నిబంధనలు: 1. ఎంట్రీలు తెల్ల కాగితముపై వ్రాసి పంపవచ్చును. లేదా మాకు వ్రాసి అచ్చు ఎంట్రీ ఫారములు పొందవచ్చును. 2. ఒకరు ఎన్ని కూపనులైనా పంపవచ్చును. 3. ఎంట్రీ రుసుము M.O. ద్వారాగాని పోస్టల్ ఆర్డరు ద్వారాగాని పంపవలెను. ఎంట్రీలతోపాటు M.O. రశీదు లేక P.O. జత చేయవలెను. 4. ఎంట్రీలలో తుడుపులు కొట్టివేతలు ఉండరాదు. 5. విజేతల లిస్టు, తరవాత పదావళి ఎంట్రీల కొరకు 20 పై. స్టాంపు జతపర్చవలెను. 6. ఒకరు కంటే ఎక్కువ మంది విజేతలు వచ్చిన బహుమతుల క్రమములో బహుమతి మొత్తం సమానముగా పంచబడును. 7. అన్ని విషయములలో మేనేజిమెంటుదే తుది నిర్ణయం. 8. లావాదేవీలు ఏవైనా వచ్చిన ఎడల రాజమండ్రి కోర్టులలో తప్ప ఇతర చోట్ల చెల్లనేరవు.

మీ ఎంట్రీలు మనియార్డర్లు: విజయ వర్షం (నెం. 1),
రాజమండ్రి, (తూర్పు గోదావరి జిల్లా).

అవి. అతను మళ్లీ నవ్వుతూ అన్నాడు: "ఫరవాలేదులే. కళ్లు మూసుకుంటాను." జయలక్ష్మి ఫక్కుమని నవ్వేసింది. ఇంతలోనే ఎంత చనువు అని ఆశ్చర్యపడింది. ఎలాగో చీర మార్చుకుని మంచం అటువైపు కూర్చుంది. అతను పడుకొని, ఆమెన్ని తనమీదికి లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. జయలక్ష్మి తన చీర చెరుగుతో పెదిమలుతుడుచుకుంది. అతను ఆమెడ పైట తీసేశాడు. మళ్లీ వేసుకోవడానికి ప్రయత్నిస్తే అడ్డు వచ్చాడు. అతని చేతులు తన దేహాన్ని ఎక్కడెక్కడో స్పృశిస్తున్నాయి. అంతా కొత్తగా ఉంది జయలక్ష్మికి. ఆక్షేపించడానికి భయం. వదిన మాటలు జ్ఞాపకానికి వచ్చి ఊరుకుంది. భర్త ఏం చేసినా అడ్డుపెట్ట రాదేమో!

జయలక్ష్మికి ఆ రాత్రి అనుభవం సరికొత్తగా ఉంది కాని, సౌఖ్యప్రదంగా లేదు. భార్యాభర్తలు ఈ విధంగానే ఉంటారేమో ననుకొంది. వదినగారిని అడగ డానికి సంకోచించింది.

తరవాత రెండు రాత్రుళ్లూ అదే అనుభవం. జయలక్ష్మికి అది మామూలైపోయింది. భర్త ఎప్పుడు తనని వదలిపెడతాడో, ఎప్పుడు నిద్రపోవచ్చో అని ఎదురుచూస్తూ ఉండేది.

మూడు రోజులైన వెంటనే రాధాకృష్ణయ్య ప్రయాణానికి సిద్ధమయ్యాడు భార్యతో. జయలక్ష్మి వెళ్లేటప్పుడు తల్లిని కౌగలించుకుని ఏడ్చింది. తండ్రికి, వదినకు నమస్కరించింది.

హైదరాబాదులో మొదటి రోజులు సరదాగా గడిపింది జయలక్ష్మి. భర్త ఎన్ని చోట్లకో తీసుకొని వెళ్లాడు. బట్టల దుకాణంలో నాలుగు వాయిల్ చీరలు, రెండు పట్టు చీరలు కొనుక్కుంది. నైలాన్ చీర కొనబోతే భర్త "వద్దు. మనకు లాయక్ కాదు" అన్నాడు. జయలక్ష్మికి ఎప్పుడూ ఇన్ని చీరలు లేవు. మంచి చెప్పుల జత కొనిచ్చాడు.

ఇల్లు పెద్దది కాకపోయినా బాగుంది. కొత్తగా కట్టింది. ఒక పనిమనిషి ప్రొద్దున్నా, సాయంత్రం వచ్చిపోతుంది, పాత్రలు తోమడానికి, ఊడ్చడానికి, బట్టలు ఉతకడానికి. కాయగూరలు, బియ్యం, పప్పు మొదలైనవి రాధాకృష్ణయ్యే కొని తెచ్చేవాడు. వంట జయలక్ష్మే స్వయంగా చేసేది. భర్త రుచులు తెలుసుకుని అనుగుణంగా తయారుచేసి అతని మెప్పుబడసేది. భర్త మాటకు ఎదురాడదు. అతనితోగాని — ఒంటరిగా —ఎక్కడికీ వెళ్లదు.

రాధాకృష్ణయ్యకు భార్య అంటే పంచప్రాణాలు. ఇటువంటి ఆదర్శ పత్ని తనకు లభించడం తన అదృష్టమే, అని మురిసిపోయేవాడు.

జయలక్ష్మికి ఇంగ్లీషు స్వల్పంగా వచ్చు. ఆ భాషా జ్ఞానం వృద్ధిచేసుకోవాలెనని ఆశ. భర్తతో చెప్పింది. ఆ రోజే ఆఫీసునుంచి వచ్చేటప్పుడు చిన్న చిన్న పుస్తకాలు, ఇంగ్లీషు—తెలుగు నిఘంటువు తెచ్చి ఇచ్చాడు. మధ్యాహ్నమంతా చేయడాని కేమీ పనిలేదు కాబట్టి ఆ సమయంలో శ్రద్ధగా చదువుకునేది. భర్త సాయంత్రం పూట నేర్పించేవాడు.

జయలక్ష్మి వారాని కొకసారి తల్లికి ఉత్తరం వ్రాసేది. విశేషా లేముంటవి గనుక ఉభయకుశలాలే

తప్ప. కూతురు జాబుల్లో అతృప్తి ఏమీ కనబడ నందుకు తల్లిదండ్రులు సంతోషించారు.

ప్రశాంతంగా, ఒడుదుడుకులు ఏవీ లేకుండా, సుఖంగా రెండు సంవత్సరాలు గడిచాయి. జయలక్ష్మికి ఏ లోటూ లేదు. మంచి భోజనం, కోరిన బట్టలు, భర్త ఆదరం. ఇంకేం కావాలో తెలియదు జయలక్ష్మికి. ఇద్దరూ ఒక్క గదిలోనే పడుకునేవారు. అయితే, రెండు మంచాలు. భర్త కోరినప్పుడు అతని మంచంమీద కొంతసేపుండి తరవాత లేచివెళ్లి తన మంచంమీద పడుకునేది. భర్తతో అనుభవం అలవాటైపోయింది. ఆ విధంగా భర్త కోరిక తీర్చడం తన ధర్మమని ఎంచేది. అంతే. తనకు అలా ఉండాలనే కోరిక ఎన్నడూ కలగ లేదు. ఆడవాళ్లకు అటువంటి కోరిక ఉండదేమో అని ఆవిడ అభిప్రాయం.

వాళ్లింటికి పక్కింట్లో రామిరెడ్డి అనే అతను ప్రతి ఆదివారం సాయంత్రం రాధాకృష్ణయ్యతో కాలక్షేపానికి వచ్చేవాడు. జయలక్ష్మి వాళ్లిద్దరికీ కాఫీ ఇచ్చేది. అతను తన భర్తకన్నా పెద్దవాడు. తల ముగ్గు బుట్ట. అయితే, ఒడ్డూపొడుగూ, దారుఢ్యమైన శరీరంవల్ల అంత వయసు చెల్లినవాడిలాగ కనబడడు. పరిచయం ఎక్కువైనందున రాధాకృష్ణయ్యతో పరిహాస మాడేవాడు. జయలక్ష్మి సౌందర్యాన్ని చూడగానే రాధాకృష్ణయ్యతో అన్నాడు: "భలే అదృష్టవంతుడ వయ్యా! ఇంత చక్కని అమ్మాయి దొరికింది. చూస్తే నా మనమరాలు జ్ఞాపకం వస్తుంది."

రామిరెడ్డి భార్య చనిపోయి చాలాకాలమైంది. ఒక్కతే కూతురు. విజయవాడలో కాపరం చేస్తూ ఉంది. తనతో విధవరాలైన చెల్లెలుమాత్రమే ఉంటుంది. అతని కుమార్తెకు ఒక్కతే ఆడబిడ్డ. బి. ఎ. చదువుతూంది గుంటూరులో. ఇంకా పెళ్లి కాలేదు. పేరు సరోజిని. అప్పుడప్పుడు మనమరాలి గురించి చెప్పేవాడు. ఆవిడ చలాకీతనం, నవనాగరికత వర్ణించేవాడు.

ఒక రోజు రామిరెడ్డి మనమరాలితో వచ్చాడు. సరోజినికి పరీక్షలైపోయి సెలవు లిచ్చారు. కొన్ని రోజులు హైదరాబాదులో ఉండిపోదామని వచ్చింది.

సరోజిని, జయలక్ష్మి ఇద్దరూ సమ వయస్కులే. అయినా, వాళ్లిద్దరికీ ఎంతో భేదం. సరోజిని నవ నాగరికత మూర్తీభవించినట్లు ఉంది. జయలక్ష్మి పూర్వకాలం యువతి వలె ఉంటుంది. జయలక్ష్మిది పుట్టు సౌందర్యం. సరోజినిది పెట్టు శృంగారం. సరోజిని కాలేజీలో చదువుకొని నదిమందితో కలిసి జీవించడం వల్ల కలగలుపుతనం ఎక్కువ. జయలక్ష్మిది కూపస్థ మండూకం. కొత్తవాళ్లతో మాట్లాడడానికి జంకు.

పరిచయమైన తరవాత సరోజిని తరుచూ మధ్యాహ్న సమయంలో వచ్చి జయలక్ష్మితో కాలక్షేపం చేస్తూ ఉండేది. శృంగారించుకోవడంలో కొత్త పద్ధతులు నేర్పింది జయలక్ష్మికి. ఆవిడ భర్త ఏమను కుంటాడో అని వాటిని అనుసరించలేదు మొదట. కాని, సరోజిని వదిలిపెట్టలేదు. ఒక రోజు బలవంతంగా శృంగారించి రాధాకృష్ణయ్య రాగానే, "చూచారా, మామయ్యా అత్తయ్య ఎంత అందంగా ఉందో?" అంది. రాధాకృష్ణయ్య జయలక్ష్మిని చూసి చాలా సంతోషించాడు.

ప్రతి దినం జయలక్ష్మి, సరోజిని కలుస్తూండే వారు. పరిచయం క్రమేపీ స్నేహంగా పరిణమించింది. "ఆయన ఆఫీసు వెళ్లాక నీకేం తోస్తుంది? ఏవైనా కథలు, నావెల్సు చదువుకోరాదూ?" అని సరోజిని సచిత్ర వారపత్రికలు, మాసపత్రికలు, కొన్ని సరికొత్త నవలలు తెచ్చి ఇచ్చింది. జయలక్ష్మి ఇలాంటివి ఎన్నడూ చదవలేదు. చదువుతూన్నకొద్దీ ఇంకా చదవాలనే ఆసక్తి కలిగింది. వాటిలో ఎక్కువగా యువతీ యువకుల ప్రేమగాథలే. వాటిని చదివే టప్పుడు కథలోని యువతి తానుగా భావించుకునేది. అయితే, ఆ కథల్లోని యువకులకూ, తన భర్తకూ ఏమాత్రమూ సామ్యం లేదు. ఆ యువకులు సన్నగా, పొడుగ్గా, కళకళలాడే కళ్లతో, ఉంగరాల జుట్టుతో, అవయవ సౌభాగ్యంతో ఆకర్షణీయంగా ఉన్నవాళ్లు. తన భర్త కొంత పొట్టిగా, మొటుగా, కాంతిలేని కళ్లతో, బట్టతలతో ఉన్నాడు.

జయలక్ష్మికి ప్రేమ స్వరూపం కించిత్తు తెలి యదు. ఆ కథల్లో యువతులు తాము ప్రేమించిన యువకుల బాహుబంధంలో ఒళ్లు మరిచిపోతారు. తానెప్పుడూ భర్త కౌగిలించినప్పుడు అలా కాలేదు. ప్రేమించిన యువకుడు కనబడకపోతే కథలోని యువతి పరితపిస్తుంది, బాధపడుతుంది. తానెప్పుడూ అలా బాధపడలేదు భర్తను గురించి. ఒక నవలలో పెండ్లి అయిన యువతి ఇంకొకణ్ణి ప్రేమించి, అతనితో లేచి పోతుంది. నిజంగా అలా చేస్తారా! కథల్లో వ్రాస్తారు అని సమర్థించుకుంది. బహుశా ఇంగ్లీషు పుస్తకాలు అనుసరించి వ్రాస్తారు కాబోలు!

(సశేషం)


వాయిదాలమీద ట్రాన్సిస్టర్



కోయల్

(గ్యారంటీతో)

3 బాండ్లు, ఆలిండియా ప్రపంచ, పోర్టబుల్ ట్రాన్సిస్టర్ నెలసరి రు. 5/- ల వాయిదా చెల్లుబడిపై వెల రు. 165/-లు. ప్రతి పల్లె, బస్తీకి ఏజంట్లు అవసరం, వగుసు వ్రాయండి:

*VIRLA AGENCIES (19)*
*Roop Nagar, Delhi-7.*



**1970 లో మీ అదృష్టము**

ఏదైన ఒక పుష్పం పేరును, మీ చిరునామా యును వ్రాసిన ఒక పోస్టుకార్డు మాత్రం పంపండి. మీకు వచ్చే 12 నెలలలో వ్యాపారంలో లాభనష్టములు, ఉద్యోగంలో ప్రమోషను.



బదిలీ, సంతానం. వివాహం, సౌఖ్యం మొదలైన వివరములు, దుష్ట గ్రహ వీక్షణలకు రక్షణ విధానములతో పాటు రు. 1-25 పై. లకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు

**PT. DEV DUTT SHASTRI**
**RAJ JYOTSHI (WAP)**
**P.B. 86, JULLUNDUR CITY**



# శుభవార్త

✱

డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులు బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్టు, బొల్లి, కేన్సర్, సంతానము లేనివారు కూడా శ్రీ యోగిగారి చికిత్స వలన సంపూర్ణ ఫలమును బడయగలరు. కావలసిన వారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్స వలన దేహములో నున్న వ్యాధులు తొలగి పోవుటయే గాక నూతన యౌవనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు ఒక రూపాయి పంపవలయును.

**శ్రీ యోగాశ్రమము**
**పెదవాల్తేరు పోస్టు,**
**విశాఖపట్టణము**